# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

సంవత్సర చందా 50/- రూ॥లు

## క్రైస్తవ మాసపత్రిక

NOVEMBER 2005

## క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

### సత్యవాణి టి.వి. కార్యక్రమములను

| | | |
|---|---|---|
| ప్రతి మంగళవారం | : | ఉదయం 6:30 గం॥లకు 'మా' టి.వి. లోను |
| ప్రతి శనివారం | : | ఉదయం 6:30 గం॥లకు 'తేజ' ఛానల్ లోను చూడండి |
| ప్రతి గురువారం (కాకినాడలో మాత్రమే) | : | SITI కేబుల్ & IN కేబుల్‌లో ఉదయం 7:00 గం॥లకు, సాయంత్రం 5:30 గం॥లకు |
| ప్రసంగీకులు | : | బ్రదర్. జాషువా గూటం |

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు విన్పించండి !!

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH


P.O.Box-80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**


*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 26 నవంబర్ 2005 సంచిక 4


# యేసుక్రీస్తు యొక్క పునరుత్థానము

(The Resurrection of Jesus Christ)

క్రైస్తవుని యొక్క విశ్వాసమంత యును, క్రైస్తవ్యమంత యును యేసుక్రీస్తు యొక్క పునరుత్థానముపై ఆధారపడి యున్నది. యేసుక్రీస్తు సిలువపై మరణించి, సమాధి చేయబడిన తరువాత మూడవ దినమున తనకు తానే ప్రాణమును పోసుకొని, సజీవుడై అద్భుత రీతిగ తిరిగి లేచెనను సంగతియే పునరుత్థానము. మొదటి శతాబ్ధములో క్రీస్తు యొక్క అపొస్తలుల బోధలో పునరుత్థానము బహు ప్రాముఖ్యాంశమై యుండెను. నాటి నుండి నేటివరకు జీవించుచున్న ప్రతి క్రైస్తవుడు పునరుత్థానము ప్రశ్నింపతగని ఒక గొప్ప వాస్తవమని అంగీకరించి విశ్వసించును. అయితే కొందరు యేసుక్రీస్తు పునరుత్థానమును శంకింతురు. అట్టివారి నుద్దేశిస్తూ అపొ.పౌలు 1 కొరింథి 15:12-19లో ఇట్లు వ్రాసెను :

క్రీస్తు మృతులలో నుండి లేపబడి యున్నాడని ప్రకటింప బడుచుండగా మీలో కొందరు - మృతుల పునరుత్థానము లేదని యెట్లు చెప్పుచున్నారు? మృతుల పునరుత్థానము లేని యెడల, క్రీస్తు కూడ లేపబడి యుండలేదు. మరియు క్రీస్తు లేపబడి యుండని యెడల మేము చేయు ప్రకటన వ్యర్థమే. దేవుడు క్రీస్తును లేపెనని, ఆయనను గూర్చి మేము సాక్ష్యము చెప్పియున్నాము గదా? మృతులు లేపబడని యెడల దేవుడు ఆయనను లేపలేదు. గనుక మేమును దేవుని విషయమై అబద్ధపు సాక్షులముగా అగపడుచున్నాము. మృతులు లేపబడని యెడల మీ విశ్వాసము వ్యర్థమే. మీరింకను మీ పాపములోనే యున్నారు. అంతేకాదు, క్రీస్తునందు నిద్రించిన వారును నశించిరి. ఈ జీవితకాలము మట్టుకే మనము క్రీస్తు నందు నిరీక్షించు వారమైన యెడల మనుష్యులందరి కంటే దౌర్భాగ్యులమై యుందుము".

మనము చదివిన ఈ వాక్యభాగములో క్రీస్తు యొక్క పునరుత్థాన సమస్యను అపో.పౌలు కొన్ని ముఖ్యాంశములుగ విభజించి నిరూపించెను. యేసును సమాధినుండి దేవుడు లేపెను. దీనికి మేమందరము సాక్షులమని (అపో.కా. 2:32) అపొస్తలులందరు దృఢముగ బోధించిరి. అందువలన క్రీస్తు మృతులలో నుండి లేపబడకపోతే అపొస్తలు లందరు అబద్ధ సాక్షులవలె అగుపడుదురు. మనము నీతిమంతులముగా తీర్చబడుటకై క్రీస్తు లేపబడెను (రోమా 4:25) అని వారు బోధించుటచే, ఆయన పునరుత్థానుడు కానియెడల మన పాపముల నుండి మనకు రక్షణ లేదు. అందుచే మన పాపములలో నశించిన వారమగుదుము. క్రీస్తు పునరుత్థానమే మన పునరుత్థాన వాగ్దానమని క్రైస్తవులు విశ్వసించుచున్నందున (1 కొరింథి 15:20) క్రీస్తు మృతులలో నుండి లేపబడకపోతే వారు సమాధి యనంతరము నిరీక్షణ లేనివారిగను, మనుష్యులందరి కంటే దౌర్భాగ్యులుగను అగుపడుదురని పౌలు తర్కించెను.

"యేసుక్రీస్తు మృతులలో నుండి పునరుత్థానుడైనందున దేవుని కుమారుడుగా ప్రభావముతో నిరూపింపబడెను" అని రోమా 1:4లో పౌలు వ్రాసెను. అందు వలన క్రీస్తు యొక్క దైవత్వము ఆయన పునరుత్థానముపై ఆధారపడి యున్నట్లు మనము గ్రహించగలుగున్నాము. యేసుక్రీస్తు ఈ లోకములో జీవించు చుండగా అనేక అద్భుతములను, మహత్కార్యములను, సూచక క్రియలను చేసెను. అయితే ఆయన మృతులలో నుండి లేచుట 'అద్భుతములకు అద్భుతమై యున్నది'.

పునరుత్థానము యథార్థమని నిరూపింప బడగల్గిన యెడల క్రీస్తుచేసిన అద్భుతములన్నియును యథార్థములని మనము ఇట్టే అంగీకరింపవచ్చును. ఆ అద్భుతములే ఆయన దైవత్వమును కూడ నిరూపించుచున్నవి (యోహా 20:30, 31). గనుక క్రీస్తు యొక్క పునరుత్థానమును మనము పరిశోధించుట ఎంతయో ఉత్తమమైనది.

క్రీస్తు పునరుత్థానమును పరిశోధించినపుడు కొన్ని చారిత్రాత్మక వాస్తవములను మనము సేకరించవలసి యున్నది. క్రీస్తు చనిపోయి తిరిగి లేచెను అనునది ఒక గొప్ప చారిత్రాత్మక వాస్తవమై యున్నది. దానికున్న చారిత్రాత్మక ఋజువులు అనేకములు. క్రీస్తు యొక్క పునరుత్థానమును గూర్చి క్రైస్తవులు, క్రైస్తవేతరులు, ఆస్తికులు, నాస్తికులు నేను చెప్పబోయే ఈ క్రింది విషయములలో ఏకీభావము కలిగి యున్నారు.

1. నజరేయుడైన యేసు అను వ్యక్తి చరిత్రలో ఒకానొక కాలమున జీవించెననియు, క్రొత్తనిబంధన ఆ వ్యక్తిని గూర్చి చెప్పుకాలములోనే ఆయన నివసించెననియు వారంగీకరింతురు.

2. ఆయన అతిత్వరలో పేరుప్రఖ్యాతులు గడించెననియు, ముఖ్యముగా సామాన్య ప్రజలలో ఆయన పలుకుబడి బహు ఘనమైనదనియు వారంగీకరింతురు.

3. పొంతి పిలాతు రోమా దేశపు అధిపతిగా యుండగా ఈ నజరేయుడైన యేసు యూదులచే సిలువపై చంపబడెననియు, ఆయన శరీరము అరిమతయి యోసేపు అను ఒక ధనవంతుని సమాధిలో ఉంచబడెననియు, ఆ సమాధి ద్వారమును మూయుటకు ఒక పెద్దరాయి దానిపైకి దొర్లింపబడెననియు, అటు తరువాత రోమా దేశపు గవర్నరు యొక్క ముద్రచే అది భద్రము చేయబడెననియు, దానిచుట్టు రోమా దేశపు కావలివారుంచబడిరనియు వారు అంగీకరింతురు.

4. అయితే ఈ సంగతులు జరిగిన మూడవ దినము ఉదయమున ఆ సమాధిలోని క్రీస్తు శరీరము మాయమయ్యెననియు, దేవుని యొక్క శక్తి వలన క్రీస్తు సజీవుడై తిరిగి లేచినట్లు ఆయన శిష్యులు ప్రగాఢముగా విశ్వసింతురనియు అందరు అంగీకరింతురు.

ఇంతవరకు మనము గమనించిన ఈ విషయములు బైబిలునందు గాక చరిత్రలో కనుగొనబడిన యథార్థములని గ్రహించవలెను. చరిత్ర దానికదే క్రీస్తు ఈలోకమునకు వచ్చెనని ప్రతిదినము ప్రబోధించుచున్నది. రేనాన్ అను ప్రసిద్ధ నాస్తికుడు క్రీస్తు పునరుత్థానమును

తిరస్కరించినను, అతడు వ్రాసిన "క్రీస్తు జీవితము" అనే గ్రంథములో క్రీస్తుయొక్క జీవన్మరణ సమాధులు యథార్థమని అంగీకరించెను. అందువలన మన ప్రస్తుత సమస్య క్రీస్తు శరీరము ఆ సమాధిని వదలగా ఏమాయెను? అను ప్రశ్నకు సంకుచిత మగుచున్నది.

బైబిలు సత్యవేదమని నమ్మువారు యేసే దేవుడు గనుక తనకుగా తాను మరణమును జయించి సజీవుడై తిరిగి లేచెనని నమ్ముదురు. నిర్దేవులు, నాస్తికులు, అవిశ్వాసులు ఆయన పునరుత్థానమును తిరస్కరించి, దానిని గూర్చి అనేక సిద్ధాంతములను కల్పించి చెప్పుదురు. యేసు నిజముగా చనిపోలేదు గాని, సిలువపై ఆయన స్పృహ కోల్పోయెననియు, సమాధిలో యుంచబడిన కొంత సేపటికి ఆయనకు స్పృహరాగా కావలివారికి కనబడకుండ ఆయన సమాధి నుండి దాటుకు పోయెననియు కొందరు వాదింతురు. ఈ ఆరోపణను చేయువారు తమ బుద్ధిని వినియోగించిన యెడల అట్టి ఆరోపణలను చేయరని నా విశ్వాసము. యేసు చనిపోయెనని సైనికులు ప్రకటించిరి. ఏలయనగా వారు యేసు నొద్దకు వచ్చి, అంతకుముందే ఆయన మృతి పొందియుండుట చూచి ఆయన కాళ్ళు విరుగగొట్టలేదు (యోహా 19:33). యేసును సిలువవేసిన ఆ సైనికుల సాక్ష్యమును కోర్టువారు అంగీకరింతురు గాని ఇంచుమించు రెండువేల సంవత్సరముల తరువాత సంశయమును వెల్లడి పరచువాని మాటలను కాదు. సిలువ వేయబడిన మనుష్యుడు సిలువపై మరణిస్తే గాని అతని శరీరమును తీసికొని వెళ్లుటకు రోమా ప్రభుత్వచట్టము ఆదేశించదు. అయితే క్రీస్తు సిలువపై చనిపోయిన తరువాతనే ఆయన శరీరము దించబడెను. యేసు మరణించెనని సైనికులకు నిర్ధారణయగుటవల్లనే యేసు దేహమును వారు సమాధి చేయుటకు తీసుకొని పోనిచ్చిరి. "సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కను పొడిచెను, వెంటనే రక్తమును, నీళ్ళును కారెను" అని యోహాను 19:34లో వ్రాయబడి యున్నది. అప్పటికే యేసు చనిపోయి కొన్నిగంటల సమయమై యుండెను. అందువలన ఆయన దేహము నందలి నీరు, రక్తము అప్పటికే వేరుపడెను. మనము గ్రహించవలసిన సంగతి ఇంకొకటి యేమంటే, అంత క్రూరముగ హింసింపబడి, బంధింపబడి, కొరడా దెబ్బలు కొట్టబడి, శ్రమలు పెట్టబడి సిలువవేయబడిన తరువాత ప మానవమాత్రుడు సమాధిరాయిని తనక తానే పొర్లించుకొని బయటకు వచ్చే శక్తిని మాత్రము కలిగియుండడు.

ప్రస్తుతము మన విచారణ అంత

యును సమాధి నుండి మాయ మయిన క్రీస్తు శరీరముపై కేంద్రీకరించుదము. ఇట్టి విచారణలో ఆ శరీర విషయమై జరుగుటకు అవకాశమున్న మూడు సంద ర్భములను మనము ఎదుర్కొనవలసి వచ్చుచున్నది. అవి.

1. క్రీస్తు శత్రువులైన యూదులు ఆయన శరీరమును సమాధినుండి తొలగించి యుండవచ్చును లేదా

2. ఆయన శిష్యులచే అది కొని పోబడెను లేదా

3. దేవుని శక్తివలన క్రీస్తు మృతులలో నుండి లేచెను.

వచ్చే మూడు సంచికలలోను ఈ మూడు సందర్భములను విడివిడిగా తీసికొని వాటి నిజనిజాలను దీర్ఘముగ పరిశోధించుదము.

యేసు మృతులలో నుండి తిరిగి లేచుట ద్వారా దేవుని కుమారుడుగా మహిమా ప్రభావముతో నిరూపింప బడెనని బైబిలు బోధించుచున్నది. నేను దేవుని కుమారుడనని మీరు విశ్వసింపని యెడల, మీ పాపముల విషయమై మారు మనస్సు పొందనియెడల, నా నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొనని యెడల, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందనియెడల మీరు మీ పాపములోనే మరణింతురు అని యేసు చెప్పెను. మిమ్మును రక్షించుటకు క్రీస్తు సంసిద్ధుడై యుండగా మీరు నిత్యనాశనమును ఎందుకు కోరుకొనవలెను? నిత్య రక్షణలో ప్రవేశించుకు క్రీస్తు పల్కులకు మీరు ఈనాడే లోబడవలెనని నా ప్రేమ పూర్వకమైన హెచ్చరిక !!

**క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్యవాణి' టి.వి. కార్యక్రమములను ప్రతి మంగళవారం ఉదయం 6:30 గం॥లకు 'మా టి.వి.' లోను మరియు ప్రతి శనివారం ఉదయం 6:30 గం॥లకు తేజ ఛానల్ లోను చూడండి.**

# పాపము నుండి విడుదల - 2

(Deliverance from Sin)

ఐగుప్తులో బానిసత్వపు కాడిక్రింద మూలుగుచున్న ఇశ్రాయేలీయుల మొరను దేవుడు విని వారిని విడిపించుటకు గాను మోషేను వారి యొద్దకు పంపెను. ఇశ్రాయేలీయులు మోషే మాటలయందు నమ్మిక యుంచునట్లు ప్రభువు అతనికి సూచక క్రియలను చేయుశక్తి నిచ్చిపంపెను. ప్రజలు అతని యందు విశ్వాస ముంచిరి. పాపపు భారముతో కుములుచు కృషించి పోవుచున్న ఈ లోకములోనికి దేవుడే తన ఏకైక కుమారుడైన యేసుక్రీస్తును పంపించెను. ప్రజలాయన యందు విశ్వాసముంచునట్లు యేసు ప్రభువు అనేక అద్భుతములను, మహ త్కార్యములను, సూచక క్రియలను చేసెను. ఆయన చేసిన అద్భుత కార్యము లను గూర్చి ఈనాడు మనము వినుట ద్వారాగాని, చదువుట ద్వారాగాని ఆయన యందు మనకు విశ్వాసము కలుగునని గత పాఠంలో నేర్చుకొని యున్నాము. పాపమునుండి విడుదల పొందవలెనంటే విశ్వాసము అవుసరమని కూడ మనము గ్రహించి యున్నాము.

సువార్త యుగమారంభమయిన తరువాత, యేసు ప్రభువు తన శిష్యులతో మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును, నమ్మనివానికి శిక్ష విధించబడును అని చెప్పెను (మార్కు 16:15, 16). యేసు యొక్క అపొస్తలులు సువార్తను ప్రకటించుచుండగా అద్భుతములు సూచక క్రియలు వారు చేయునట్లు, పరిశుద్ధాత్మని శక్తి వారికీయబడెను. "వారు బయలుదేరి వాక్యమందంతట ప్రకటించిరి; ప్రభువు వారికి సహకారుడై యుండి వెనువెంట జరుగుచు వచ్చిన సూచక క్రియల వలన వాక్యమును స్థిరపచుచుండెను" (మార్కు 16:20). ఈ వచనము క్రైస్తవ యుగ మారంభమయినప్పుడు జరిగించబడిన సూచక క్రియల ప్రయోజనమును మనకు తెలియజేయుచున్నది. అంటే ఆనాడు అపొస్తలులు నానావిధ అద్భుతములను, సూచక క్రియలను ఎందునిమిత్తము చేసిరో ఈ వచనము చెప్పుచున్నది. "సూచక క్రియలవలన వాక్యము స్థిరపరచబడుచుండెను. అపొస్తలులు సర్వలోకమునకు సువార్తను బోధించిరి, సూచక క్రియలను చేసిరి. వారు చెప్పువాక్యము కాదుగాని, ప్రభువే వారితో యున్నట్లు

లేదా వారు బోధించేది ప్రభువు యొక్క వాక్యమేయని ప్రజలకు నిర్ధారణ యగునట్లు వెనువెంట జరుగుచు వచ్చిన సూచక క్రియలవలన ఆవాక్యము స్థిరపరచబడెను. "ఎందుకనగా దేవదూతల ద్వారా పలుకబడిన వాక్యము స్థిరపరచబడినందున ఇంత గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించుకొందుము? అట్టి రక్షణ ప్రభువు బోధించుట చేత ఆరంభమై దేవుడు తన చిత్తాను సారముగా సూచక క్రియల చేతను, మహత్కార్యముల చేతను నానావిధములై అద్భుతములచేతను, వివిధములైన పరిశుద్ధాత్మ వరములను అనుగ్రహించుట చేతను వారితో కూడ సాక్ష్యమిచ్చుచుండగా వినినవారిచేత మనకు దృఢపరచబడెను" (హెబ్రీ 2:3-4). సూచక క్రియలనుగూర్చి యూదుల అధికారియైన నీకొదేము సరియైన భావమును కలిగియుండెను. అతడు యేసునొద్దకువచ్చి "బోధకుడా నీవు దేవునియొద్ద నుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము; దేవుడతనికి తోడై యుంటేగాని నీవుచేయుచున్న సూచక క్రియలను ఎవడును చేయలేడని ఆయనతో చెప్పెను" (యోహాను 3:2). యేసు క్రీస్తు చేసిన బోధనలనుబట్టి, మహత్కార్యములు అద్భుతములనుబట్టి ఆయన దేవుని కుమారుడని మనకు నిరూపింపబడెను. అపొస్తులుల ద్వారా కలిగిన సూచక క్రియలు క్రొత్త నిబంధన వాక్యమును స్థిరపచుటకు జరిగించబడెను. ఆ వాక్యము స్థిరపరచబడి, ధృవపరచబడి, గ్రంథ రూపమున మనకీయబడియున్నది గనుక సమస్త మాయెనని సూచక క్రియలు, అద్భుతములు సమాప్త మాయెనని మనము గ్రహించవలెను. దేవుని చిత్తమును మనము తెలిసి కొనుటకు ఈనాడు మనము లేఖనములను పరిశోధింపవలెనే గాని అద్భుతముల కొరకు ఎదురు చూడరాదు.

ఇశ్రాయేలీయులు ఐగుప్తునుండి విమోచింపబడుటకు వారు దేవుని యందును, ఆయన సేవకుడైన మోషే యందును విశ్వాస ముంచవలసివచ్చెను, వారు విశ్వాస ముంచిరి. అంతే కాదు దేవుడు వారి నుండి మారుమనస్సు కోరెను. వారు ఐగుప్తును విడనాడి మోషేను లేదా యెహోవాను వెంబడించుటకు తమ హృదయములో నిశ్చయించుకొనవలసి వచ్చెను. వారు మోషే మాటలను నమ్మి యుండియు ఐగుప్తును విసర్జించుటకు ఇష్టపడని యెడల వారి మనస్సులో మార్పేది? లేదు కదా? అయితే బానిసత్వము నుండి విమోచింపబడగోరువారు ఐగుప్తును విడనాడుటకు మాత్రమే గాక మోషేను వెంబడించుటకు కూడ నిర్ణయించుకొనవలెను.

ఈనాడు పాపము నుండి మనము

విడుదల పొందగోరుచున్న యెడల మనము ప్రభువైన యేసుక్రీస్తు నందు విశ్వాసముంచుటయే గాక, పాపముల నిమిత్తము మారుమనస్సు పొందవలెను. అంటే మన పాపములను విడనాడి ప్రభువును వెంబడింతుము అని నిశ్చయించుకొనవలెను. పాపముల విషయమై మనస్సులో ఎట్టిమార్పు రావలెనంటే ఆమార్పు మన హృదయములోను జీవితములోను కనబడవలెను. "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరు ఆలాగే నశింతురు" అని యేసుప్రభువు చెప్పెను (లూకా 13:5). మారుమనస్సును గూర్చి ఆయన మనకొక ఉదాహరణకూడ ఇచ్చి యున్నారు :

"ఒక మనుష్యునికి ఇద్దరు కుమారులుండిరి. అతడు మొదటివాని యొద్దకువచ్చి కుమారుడా నేడుపోయి ద్రాక్ష తోటలో పనిచేయుమని చెప్పగా వాడు పోను అని యుత్తర మిచ్చెను గాని పిమ్మట మనస్సు మార్చుకొని పోయెను" (మత్తయి 21:29). పాపముల విషయమై మనము మనస్సు మార్చుకొన్నప్పుడు పాపములను విసర్జించుటయేగాక, తండ్రియైన దేవుని చిత్తమును నెరవేర్చుటకు నిశ్చయించుకొందుము.

ఇశ్రాయేలీయుల యొక్క విమోచన షరతులతో కూడియున్నది. ఐగుప్తులో యున్న ఇశ్రాయేలీయుల నందరిని దేవుడు హనోకును తీసికొని పోయినట్లు అద్భుతరీతిగా కానాను తీసికొనిపోగలడు. అయితే దేవుడట్లు చేయలేదు. వారు ఐగుప్తును విడనాడు అవకాశమును తరుణమును వారికి కల్పించి వారిని నడిపించెను. అయితే ఈ పనిలో వారు దేవునితో సహకరించుట అత్యవసరము. వారి విమోచన బేషరతైనది కానేకాదు. తమ్మును తాము విమోచించుకొనుటలో వారు చేయదగి నంత చేయవలసి వచ్చెను.

మన విమోచనకూడ షరతులేనిది కానేకాదు. దేవుడు మననుండి కోరేది బరువైన సంగతి ఏమికాదు. దేవుడేమి చేయగలడునునది ఇప్పుడు ప్రశ్న కాదు గాని, ఆయన ఏమి చేయబోవు చున్నాడను నది ఇప్పటి ప్రశ్న. "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును" అని యేసు చెప్పెను (మత్తయి 7:21). మనము రక్షింప బడునట్లు ఆయన మనకు కొన్ని ఆజ్ఞల నిచ్చి యున్నారు. "ఆయన ప్రతివానికి వానివాని క్రియల చొప్పున ప్రతిఫలమిచ్చును. సత్క్రియను ఓపికగా చేయుచు మహిమను ఘనతను అక్షయతను వెదకువారికి నిత్యజీవము నిచ్చును. అయితే – సత్యమునకు లోబడక

దుర్నీతికి లోబడువారి మీదికి దేవుని ఉగ్రతయు రౌద్రమును వచ్చును" (రోమా 2:6-9). తనకు విధేయులైన వారికే యేసుక్రీస్తు నిత్యరక్షణకు కారకుడాయెను (హెబ్రీ 5:8). యేసును వెంబడించి స్వతంత్రునిగా జీవించుము. ఆయనను నిరాకరించిన యెడల సాతాను యొక్క బానిసవలె మరణింతువు.

ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశపు బానిసత్వము నుండి చివరిగా విడుదల పొందక ముందు బాప్తిస్మము పొందిరి!! "సహోదరులారా, యీ సంగతి మీకు తెలియకుండుట నాకిష్టము లేదు, అదేదనగా మన పితరులందరు మేఘము క్రిందనుండిరి. వారందరు సముద్రములో నడచిపోయిరి. అందరు మోషేనుబట్టి మేఘములోను సముద్రములోను బాప్తిస్మము పొందిరి" యని అపొ.పౌలు వ్రాసెను (1 కొరింథి 10:1,2). వారు బాప్తిస్మము పొందకముందు మోషేను వెంబడించుచున్నను వారప్పటికింకను ఫరోయెడల అయిష్టత కలిగిన బానిసలే. వారు ఫరోచేతిలోని వస్తువులే. అయితే తమపై యేలుబడిచేయుచున్న ఈపాత యజమానులు ఎర్రసముద్రములో సంపూర్తిగ మరణించువరకు వారు మోషే అధికారములోనికి సంపూర్తిగ రాలేక పోయిరి. వారు మోషేను బట్టి అనగా మోషే అధికారములోనికి బాప్తిస్మము పొందిరి.

ఇశ్రాయేలీయులు మేఘములోను, సముద్రములోను బాప్తిస్మము పొందిరి. వారి బాప్తిస్మమునకు ఈ రెండును అవసరమాయెను. వారు ఎర్ర సముద్రములో ప్రయాణించు చుండగా వారికి ఇరుప్రక్కల సముద్రపు నీటిగోడ యుండెను. వారివెంబడియున్న మేఘమయితే వారిని తరముకొని వచ్చు చున్న ఐగుప్తీయులకు వారు కనబడకుండా అడ్డువచ్చెను. అట్లువారు మేఘములోను సముద్రములోను ముంచబడిరి. పాతి పెట్టబడిరి, బాప్తిస్మము పొందిరి, విమోచింపబడిరి.

మనము పాపపు బానిసత్వము నుండి విమోచింపబడ గోరుచున్న యెడల చివరిగా క్రీస్తులోనికి బాప్తిస్మము పొందవలెను. మనము క్రీస్తునందు విశ్వసించి, మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందకుండా యున్నంతకాలము ఇశ్రాయేలీయులకు వలెనే పాపమంటే అయిష్టత కలిగిన బానిసలుగా యుందుము. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినప్పుడు నీ పాత యజమానియగు పాపమును ఆ నీటి సమాధిలో సంపూర్తిగా పాతిపెట్టగలవు. నీవట్లు చేయువరకు క్రీస్తుయొక్క సంపూర్ణ అధికారములోనికి రాలేవు. క్రీస్తు యేసు లోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?"

(రోమా 6:3). ఈ లోకమునుండి క్రీస్తు సంఘమును వేరుచేయునట్టిది బాప్తిస్మము. పాపము యొక్క బానిసత్వము నుండి క్రీస్తులోని స్వాతంత్ర్యమునకు నడిపించునట్టిది బాప్తిస్మము. క్రీస్తు-యేసును నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" (మార్కు 16:16). "మీరు మారుమనస్సు పొంది పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపో.కా. 2:38). "గనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్టి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుము" (అపో.కా. 22:16).

ఎర్రసముద్రము ద్వారా ఇశ్రాయేలీయులను నడిపించి ఆ దినమున యెహోవా ఐగుప్తీయుల చేతిలో నుండి ఇశ్రాయేలీయులను రక్షించెను (నిర్గమ 14:39). ప్రభువు వారికి మార్గమును తెరచి వారిని రక్షించెను. దేవుడాజ్ఞాపించిన రీతిగా వారు ముందుకు నడచి తమ్మును తాము రక్షించుకొనిరి.

యేసుక్రీస్తు మన రక్షకుడు. ఆయన తప్ప ఈలోకాన్ని రక్షించేవాడు యెవడును లేడు (అపో.కా. 4:12). మనము రక్షింపబడు మార్గమును ఆయన తెరిచి యున్నారు. ఆయన యిచ్చిన ఆజ్ఞలకు లోబడుచు ముందుకు వెళ్ళిన యెడల మనలను మనమే రక్షించుకొనగలము. మూర్ఖులగు ఈతరము వారికి వేరై రక్షణ పొందుడి యని పరిశుద్ధాత్ముడు ఈనాడు మిమ్మును హెచ్చరించు చున్నాడు (అపో.కా. 2:40).

నీవు పాపపు బానిసత్వము నుండి విమోచింపబడగోరు చున్నావా? యేసు ప్రభువునందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము. పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తులోనికి బాప్తిస్మము పొంది ప్రభువు యిచ్చు రక్షణను ఈనాడే చేపట్టుము. మీకు సమీపములో యున్న క్రీస్తు సంఘస్థులను సంప్రదించండి, లేదా నేడే మాకొక జాబు వ్రాయండి!!

- జాషువా గూటం

గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు
50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.
SATYA VANI, P.O.BOX-80, KAKINADA - 533 001.

# క్రైస్తవ గృహం

(గత సంచిక తరువాయి)

## వ్యభిచారము

వ్యభిచారులు నిత్యనాశనమునకు గురియగుదురని బైబిలు బోధించుచున్నది. అపొ.పౌలు కొరింథులోని పరిశుద్ధులకు ఇట్లు వ్రాసాడు: "అన్యాయస్థులు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరని మీకు తెలియదా? మోసపోకుడి; జారులైనను విగ్రహారాధకులైనను వ్యభిచారులైనను, ఆడంగితనము గలవారైనను పురుష సంయోగులైనను దొంగలైనను లోభులైనను త్రాగుబోతులైనను దూషకులైనను దోచుకొను వారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు" (1 కొరింథీ 6:9-10).

అట్టి వారిలో కొందరు మారుమనస్సు పొంది సువార్తకు లోబడి క్షమాపణ పొంది యున్నారని పౌలు చెప్పెను. "మీలో కొందరు అట్టివారైయుంటిరిగాని, ప్రభువైన యేసు క్రీస్తు నామమును మనదేవుని ఆత్మయందును మీరు కడుగబడి పరిశుద్ధ పరచబడినవారై నీతిమంతులుగా తీర్చబడితిరి" (1 కొరింథీ 6:11).

అపొ.పౌలు కొరింథులో సువార్త బోధించినందువలన "కొరింథీయులలో అనేకులు విని విశ్వసించి బాప్తిస్మము పొందిరి" యని అపొ.కా. 18:8 చెప్పుచున్నది. దేవుని కృపవలన ప్రజలు తమ పాపములనుండి మారుమనస్సు పొంది క్షమించబడి, క్రైస్తవ జీవితాన్ని జీవిస్తు పరలోకం వెళ్ళగలరు (అపొ.కా. 2:37-38). అయితే మారుమనస్సు పొందని ఏ పాపమైనను కొనసాగించబడుచుయుంటే అట్టి ఆత్మ నశించిపోవును అని బైబిలు బోధించుచున్నది. అందువలన క్షమాపణ బేషరతుగా లభించేదికాదు. పరిత్యాగము నొందినవారు తమ మిగిలిన జీవితకాలమంతా బ్రహ్మచారులుగా యుండవచ్చును. పాపమును గూర్చి మారుమనస్సు నొందిన వ్యక్తి పాపమును అభ్యసించదు. లేఖన విరుద్ధ వివాహము కూడ దీనిలో యున్నది. మారుమనస్సులేని యెడల క్షమాపణ కూడా యుండదు. వ్యభిచారము చేయువాడు పాపములో జీవించుచున్నాడు (కొలస్స 3:5-10). బాప్తిస్మము పొందిన తరువాత కూడ వ్యభిచారములో జీవిస్తుయుంటే బాప్తిస్మము అతని రక్షించదు.

కొందరు చట్టప్రకారము వివాహ మాడవచ్చును గాని అది లేఖనార్ధ వివాహము కాకపోవచ్చును. ఆదిలో ప్రభుత్వము మానవుని చేయలేదు. వివాహ చట్టమును చేయలేదు. మానవుని చేసినదేవుడు, వివాహ చట్టము నిచ్చిన దేవుడు పరిత్యాగానికి పునర్వివాహానికి ఒకే ఒక్క కారణం యిచ్చారు. జారత్వము! నిజాయితీగాయున్న వ్యక్తి అపరాధము చేసిన వ్యక్తిని జారత్వకారణము వలన పరిత్యజించవచ్చును, పునర్వివాహ మాడవచ్చును. నిజాయితీగా యున్నవ్యక్తి వేరొక వ్యక్తిని పెండ్లాడినను అది వ్యభిచారము కాదు. గాన అపరాధము చేసిన వ్యక్తి అట్లు చేయుటకు లేఖనము అనుమతిలేదు. (మత్తయి 19:9). తదుపరి అపరాధము చేసిన వ్యక్తి తన పాపము విషయమై మారు మనస్సు పొంది, నమ్మకముగా జీవిస్తే పరలోకము వెళ్ళవచ్చును. వ్యభిచారము గూర్చి మారు మనస్సు పొందితే దేవుడు క్షమిస్తాడు గాని అపరాధము చేసిన వ్యక్తి పునర్వివాహము చేసికొనే హక్కు కోల్పోవును. జారత్వ కారణము వలనగాక వేరే కారణమువలన విడాకులు పొందిన వారిలో ఎవరికి పునర్వివాహమాడే అవకాశం కుదరదు. అట్టి సందర్భంలో విడిపోయిన ఇద్దరు వేరే వ్యక్తులను వివాహ మాడిన యెడలను అది వ్యభిచారమగును (1 కొరింధీ 7:10-11).

వ్యభిచారమును అపో.పౌలు శరీర కార్యముగా వర్ణించాడు. "శరీర కార్యములు స్పష్టమై యున్నవి. అవే మనగా జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు క్రోధములు, కక్షలు మొదలగునవి వాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరు" (గలతీ 5:19-21).

నేడు స్వలింగ సంపర్కాన్ని తదితర జారత్వక్రియలను సమర్ధించువారు కొందరున్నారు. దేవుని వాక్యము అట్టివాటిని ఖండించు చున్నది. స్వలింగ సంపర్కము పాపమనిబైబిలు హెచ్చరించు చున్నది. పురుషుడు వేరొక పురుషుని, స్త్రీ ఇంకొక స్త్రీని వివాహమాడాలని దేవుడు ఎన్నడు ఉద్దేశించలేదు. అట్టి అక్రమ సంబంధాలను దేవుడు సహించడు. అది హేయము. "స్త్రీ శయనమువలె పురుష శయనము కూడదు; అది హేయము" (లేవి. కా. 18:22; రోమా 1:24-32). ఏకలింగ వివాహములు అవాచ్యములు, అసహ్యములు. అట్టివి దేవుని సంకల్పములో లేవు.

వివాహమును గూర్చిన దేవుని చట్టము సార్వత్రికము. అది అన్ని చోట్ల యున్న అందరి ప్రజలకు వర్తించును. యేసు ఇట్లు చెప్పెను : "వ్యభిచారము

నిమిత్తమే తప్ప తన భార్యను విడనాడి మరియొకతెను పెండ్లిచేసికొనువాడు వ్యభిచారము చేయుచున్నాడు. విడనాడ బడిన దానిని పెండ్లి చేసికొనువాడు వ్యభిచారము చేయుచున్నాడు" (మత్తయి 19:9). రోమా 13:9లో పౌలు వ్యభిచరింపవద్దు అని హెచ్చరించాడు. వ్యభిచరించువారు అగ్ని గంధకములతో మండు గుండములో పాలు పొందుదురని యోహాను చెప్పాడు (ప్రకటన 21:8; 22:15). వివాహమునకు ముందు, వివాహమునకు వెలుపల యుండే లైంగిక సంపర్కము హేయము. "వ్యభిచరింప వద్దు" అనే దేవుని శాసనము ఇంకా అమలులోనే యున్నది (నిర్గమ 20:14; రోమా 13:9). "మీరు పరిశుద్ధుల గుటయే, అనగా మీరు జారత్వమునకు దూరముగా ఉండుటయే దేవుని చిత్తము" (1 కొరింథీ 4:3).

## క్రీస్తు, పౌలు

భర్తబ్రతికి యున్నంతకాలము భార్య అతనికి బద్ధురాలై యుండునని అపొ.పౌలు రెండుమారులు చెప్పాడు: "భర్తగల స్త్రీ, భర్త బ్రతికి యున్నంతవరకే ధర్మశాస్త్రము వలన అతనికి బద్ధురాలు గాని, భర్త చనిపోయిన యెడల భర్త విషయమైన ధర్మశాస్త్రము నుండి అమె విడుదల పొందును. కాబట్టి భర్త బ్రదికి యుండగా అమె వేరొక పురుషుని చేరిన యెడల వ్యభిచారిణి యనబడునుగాని, భర్త చనిపోయిన యెడల ఆమె ధర్మ శాస్త్రము నుండి విడుదలపొందెను గనుక వేరొక పురుషుని చేసికొనినను వ్యభిచారిణి కాకపోవును" (రోమా 7:2-3).

"భార్య తన భర్త బ్రదికి యున్నంత కాలము బద్ధురాలై యుండును. భర్త మృతిపొందిన యెడల ఆమె కిష్టమైన వానిని పెండ్లిచేసికొనుటకు స్వతంత్రురాలై యుండును గాని ప్రభువు నందు మాత్రమే పెండ్లిచేసికొనవలెను" (1 కొరింథీ 7:39).

మరణము వలన తప్ప మరియే కారణము వలనను వివాహ బంధము వీడిపోదని, పౌలు దానిలో వినాయింపు యేమీ ఇయ్యలేదని కొందరు తలస్తారు. అదే గనుక కరక్టయితే పౌలు ఒకటి, క్రీస్తు ఇంకొకటి బోధించుచున్నట్లు గుపడుదురు. ఆది నుండియు దేవుని చట్టమేమై యుండెనో దానిని గూర్చి క్రీస్తు బోధించెను. గనుక ఆత్మావేశము గల పౌలు దానికి భిన్నముగా ఇంకొకటి బోధించడు గదా, అయితే దీనికి జవాబే మిటి? క్రీస్తు యిచ్చిన వినాయింపును గూర్చి పౌలు ఎందుకు చెప్పలేదు? నిజానికి జవాబేమంటే - ఒక చట్టాన్ని, శాసనాన్ని యిచ్చేటప్పుడు దాని వినాయింపును / వినాయింపులను కూడా చెప్పనవసరం లేదు.

రోమా 7:2-3లో పౌలు వివాహమును గూర్చిగాక, వివాహాన్ని ఒక ఉదాహరణగా అక్కడ వినియోగించి, యూదులు క్రీస్తులో ఇప్పుడు మోషే ధర్మ శాస్త్రము నుండి విడుదలనొందారని ఉద్ఘాటించాడు. ఒక స్త్రీ యొక్క భర్త చనిపోగానే ఆమె వేరొక పురుషుని వివాహమాడే స్వాతంత్ర్యము ఎట్లు కలిగి యున్నదో అట్లే యూదులు మోషే ధర్మ శాస్త్రము విషయము మృతులై క్రీస్తుతో ఏకమవుటకు స్వాతంత్రులైరి యని అతడు ఉపదేశించాడు. జారత్వము జరిగించబడాలని దేవుని చిత్తము కాదు. ధర్మశాస్త్రములో ఏమున్నదో దానినే పౌలు ఉపయోగించాడు.

1 కొరింధీ 7:39లో భర్త బ్రతికి యున్నంతకాలము భార్య అతనికి బద్ధురాలై యుండునని పౌలు చెప్పాడు గాని దాని వినాయింపులను యేమియు చెప్పలేదు. మరల మార్కు 10:11-12, లూకా 16:8 వచనములు ఈ అంశముపై మత్తయి వలె యే విధమైన వినాయింపులను గూర్చి పలుకవు. అలాగే 1 కొరింధీ 7:1-14; 25-26, 40 వచనములలో పౌలు షరతుల్లతో కూడిన సలహాలు నిచ్చాడు, గాని అతడు క్రీస్తు బోధను వ్యతిరేకించలేదు. క్రీస్తు చెప్పని కొన్ని సంగతులను మాత్రమే పరిశుద్ధాత్మా వేశము వలన అతడు చెప్పాడు.

వివాహములో అపరాధము చేయని వ్యక్తి వ్యభిచారము చేసిన వ్యక్తిని క్షమించి కాపురము చేయవచ్చును. గాని యిది సాధారణంగా జరుగనిపని. అందువలన వ్యభిచార కారణమువలననే తప్ప మరియే కారణము వలననైను పరిత్యజించి, పునర్వివాహమాడుట దేవుని దృష్టిలో తప్పు. మనం దేవుని చట్టాన్ని మార్చ లేము. వ్యభిచార కారణము వలన గాకుండా విడిపోయిన దంపతులు తిరిగి వారిద్దరు వేరే వ్యక్తులను వివాహమాడితే ఆ నలుగురు వ్యభిచారము చేయుచున్న వారగుదురు.

1 కొరింధీ 7:12-15 పౌలు చెప్పిన మాటలను బట్టి విశ్వాసులు పరిత్యాగము పొంది పునర్వివాహము చేసికొనవచ్చని కొందరి యభిప్రాయము: "ప్రభువుకాదు, నేనే తక్కిన వారితో చెప్పునదేమనగా - ఏ సహోదరునికైనను అవిశ్వాసురాలైన భార్య యుండి, ఆమె అతనితో కాపురము చేయ నిష్టపడిన యెడల, ఆమె అతని పరిత్యజింపకూడదు. అవిశ్వాసియైన భర్త భార్యను బట్టి పరిశుద్ధ పరచబడును, లేని యెడల మీ పిల్లలు అపవిత్రులై యుందురు, ఇప్పుడైతే వారు పవిత్రులు. అయితే అవిశ్వాసియైనవాడు ఎడబాసిన ఎడబాయ వచ్చును; అట్టి సందర్భము లలో సహోదరునికైనను సహోదరి కైనను నిర్బంధములేదు. సమాధానముగా

యుండుటకు దేవుడు మనలును పిలిచి యున్నాడు".

మిశ్రమ వివాహమును గూర్చి క్రీస్తు తన పరిచర్యలో యేమీ చెప్పలేదని పౌలు అనుచున్నాడు. విశ్వాసియైనవాడు అవిశ్వాసితో కాపురము చేయుటకు క్రీస్తునందలి విశ్వాసాన్ని పరిత్యజించ వలసిన పనియేమీ లేదు. 'అవిశ్వాసియైన వ్యక్తి ఎడబాసిన ఎడబాయనిమ్ము; నీవు నమ్మకముగా యుండుము' అని అతని ఉద్దేశము. అవిశ్వాసియైన వాడు పరిత్యజించి, జారత్వము జరిగించిన యెడల, విశ్వాసి ఆ కారణమును బట్టియే పరిత్యాగము (విడాకులు) పొంది, అవుసరమయితే పునర్వివాహము చేసి కొనవచ్చును. వివాహబాంధవ్యము కొరకు ఆమె క్రీస్తును విడనాడరాదు. అతడు ఎడబాసిన ఎడబాయ వచ్చును (1 పేతురు 3:15).

## తీర్పు దినము

దేవుని నుండి మనము యేమీ దాచి యుంచలేమని గుర్తుంచుకోవాలి. ఎవరు తప్పుచేయుచున్నారో, ఒప్పు చేయు చున్నారో ఆయన సమస్తమును ఎరుగును. శరీర కార్యముల నభ్యసించు వారు ఆయనకు ఎరుకయే. ఆయన దృష్టికి కనబడనిది యేదీ లేదు (కీర్తన 139:7-12; ప్రసంగి 12:14; హెబ్రీ 4:13). నైతిక విషయాలలో ఏ దేశము దేవుని సూత్రములకు భిన్నముగా నడిచి మనుగడ కలిగియుండదు. వివాహము, పరిత్యాగము, పునర్వివాహమును గూర్చి కూడ దేవుని సూత్రమును మనం నిర్లక్ష్యం చేయకూడదు. నేడు కొందరు "చట్టపరమైన వ్యభిచారంలో" జీవి స్తున్నారు. అట్టివారు లేఖనముల ప్రకారం వివాహము చేసికొనకుండగానే పాప ములో జీవించుచున్నారు. తీర్పు దినము వచ్చుచున్నది (మత్తయి 7:21-27). నిత్యత్వము మనముందే యున్నది.

## అనేక మంచి గృహములు.

నేడు అనేక మంచి గృహములున్నవి. అవి మనదేశాన్ని, ప్రపంచాన్ని ప్రభావితం చేయుచున్నవి. అన్ని గృహాలు అలాగే యుండాలని దేవుడు కోరారు. భర్త ఎల్లవేళలా తన భార్యను ప్రేమించాలి. గుణవతియైన భార్య యెహోవా యిచ్చు దానము. ఆమె స్వరము అతి మధురము ఆమె ప్రార్థనలు అతని తలమీదికి దిగు శ్రేష్ఠమైన దీవెనలు (సామె 31:10-31). యిది వ్యభిచార పాపమును అంతమొం దించును.

పౌలు ఇట్లు వ్రాసాడు : "అయినను జారత్వములు జరుగుచున్నందున ప్రతి వానికి సొంత భార్య యుండవలెను, ప్రతి స్త్రీకి సొంత భర్త యుండవలెను" (1 కొరి 7:2). అలాగే మంచి భర్త కలిగిన స్త్రీ కూడా ధన్యురాలే (ఎఫెసీ 5:22-23).

ఆమె అతని తన జీవిత భాగస్వామిగా ఎంచి ప్రేమించవలెను. నేడు మన మధ్య నున్న అనేక క్రైస్తవ గృహములు ఈ భూమికి ఉప్పయియున్నారు (మత్తయి 5:13). దేవుడు అట్టి గృహాలను దీవించును గాక!

## వివాహము ఘనమైనది

"వివాహము అన్ని విషయములలో ఘనమైనదిగాను, పానుపు నిష్కళంకమైనదిగాను ఉండవలెను; వేశ్యాసంగులకును వ్యభిచారులకును దేవుడు తీర్పు తీర్చును" (హెబ్రీ 13:4).

అన్నిటికంటె వివాహము ఘనమైనదిగా ఎంచబడాలి. బ్రహ్మ చర్యము దీనికంటే శ్రేష్టమైనది అనునది అబద్ధసిద్ధాంతము (1తిమో 4:1-3). నరుడు ఒంటరిగా నుండుట మంచిది కాదని ఎంచి దేవుడు పరదైసువలె దానిని ప్రతిష్టించెను. మొదటి దంపతుల వివాహమును దేవుడే జరిపించి, ఆశీర్వదించెను. గలిలయలోని కానాలో జరిగిన వివాహమునకు హాజరై యేసు దానిని ఘనపరచెను. తన మొదటి సూచకక్రియను అక్కడ చేసెను (యోహాను 2:1-11). స్త్రీ పురుషుల లైంగిక సంపర్కమును దేవుడు వివాహములో మాత్రమే యుంచెను.

భార్యభర్తలు ఒండొరులను గౌరవించునప్పుడు వివాహము ఘనమైనది. శారా అబ్రహామును 'యజమాని' యని పిలిచి అతని ఘనపరచెను (1 పేతురు 3:6). భర్తలు ఎల్కానావలె పదిమంది కుమాళ్ల కంటె శ్రేష్టమైన వారయితే వివాహము ఘనమైనదవుతాది (1సమూ 1:8). రూతు బోయజు యెడల దయయు సత్ప్రవర్తనయు కలిగియుండెను (రూతు 3:10-11). అకుల ప్రిస్కిల్లయను దంపతుల వివాహము ఘనమైనది. వారిద్దరు ప్రభువు కొరకు పనిచేసారు. ఇతరులకు సువార్త బోధించారు, సంఘాన్ని ఆదరించారు ప్రాణాల కొరకైనా తెగించారు (అపో.కా. 18:26; రోమా 16:3-5; 1 కొరింధీ 16:19; 2 తిమో 4:19). వారిద్దరి పేర్లు ఎప్పుడు కలిసే చెప్పబడుతాయి. పౌలు కొరకు వారు తమ ప్రాణాలను సయితము ఫణముగా పెట్టినందున సంఘసభ్యుల మన్ననలను పొందారు. దేవుని రాజ్యములో నమ్మకమైన దంపతులుగా వారు ప్రఖ్యాతి గాంచారు.

చివరిగా వివాహములో ప్రేమ యొక్క గొప్ప మాదిరిగా సంఘము కొరకు క్రీస్తు చేసిన త్యాగాన్ని, దాన్ని సంరక్షించిన విధానాన్ని జ్ఞాపకముంచుకొందాము. "పురుషులారా మీ భార్యలను ప్రేమించుడి; అటువలె క్రీస్తు కూడ సంఘమును

ప్రేమించి అది కళంకమైనను ముడత యైనను అట్టిది మరి ఏదైనను లేక పరిశుద్ధమైనది గాను నిర్దోషమైనదిగాను మహిమగల సంఘము గాను ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొన వలెనని...దాని కొరకు తన్ను తాను అప్పగించు కొనెను" (ఎఫెసీ 5:25-27). స్వార్థపరత్వము భార్యభర్తల మధ్య విభేదాలకు మూలము. అందువలన ఒండొరులను ప్రేమించుచు నిస్వార్థముగా జీవింతము.

## పరలోకము, ఆత్మయొక్క గృహము

గృహము మాధుర్యమైన పరలోకము నకు సారూప్యము (ప్రసంగి 12:5). సమాధియనంతరము, నిత్య సంతోషము మనకొరకు ఎదురుచూచు చున్నది. అక్కడ మన స్నేహబంధాలు మరణం వలన తెగిపోవు. పరలోకములో ముందుగా చేరుకొన్న బంధువులు మిత్రులతో మరల కలుస్తాము, మరెన్న టికీ వీడిపోము.

మరణము వలన, భూమి మీద మనం కొంతకాలము వేరైపోయినను మనం మరణ పర్యంతము నమ్మకముగా యున్న యెడల మన ప్రియులను మరల కలసి కొంటాము. అదొక గొప్ప నిరీక్షణ (ప్రక 2:10). పరలోకం మన నిత్యగృహం. అక్కడ మన పరలోకపు తండ్రి సన్నిధానములో నిత్యము నివసించె దము. అక్కడ మరణం యిక వుండదు. సమాధులు గాని అంతిమ సంస్కారములు గాని అక్కడ వుండవు.

వృద్ధులైన తలిదండ్రులు తమ పిల్లలు వారి జన్మదినాలలో గాని ప్రత్యేక దినాలలో గాని వారిని చూడడానికి వచ్చినప్పుడు ఎంతో సంతోషిస్తారు. ఒక్కోసారి బిడ్డలందరు రాలేకపోవచ్చును. గాని భూమి మీద మనకు గృహాన్ని యిచ్చిన పరలోకపు తండ్రి తన బిడ్డ లందరు పరలోకంలో సమావేశమై నప్పుడు ఆయన ఆనందము అనంతమైన దవుతాది! బంధువులు, మిత్రులు, భార్యలు, భర్తలు అనేక సంవత్సరాల తరువాత మరల కలిసి కొనడం ఎంత ఆనందదాయకం! బహుశ కొన్ని సంవత్స రాల క్రితం సమాధి యొద్దవారు వేరైపోయారు, ఇప్పుడు మరల కలసి కొంటారు. మరెన్నిటికిని వేరైపోరు.

యేసు ఇప్పుడు మనకొరకొక స్థలము సిద్ధపరచు చున్నారు. ఆయన ఇట్లు చెప్పారు. "మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను; నేను వెళ్లి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును" (యోహాను 14:2-3).

పరలోకం! పరలోక గృహం!! అక్కడ దు:ఖముండదు, ఏడ్పు ఉండదు,

కన్నీళ్లుండవు, మరణం వుండదు (ప్రకటన 21:4-5). పరలోకం! నిత్యగృహం! ఆనంద నిలయం! మాధుర్యం మహిమాన్వితం!! దేవునితో, క్రీస్తుతో యుండే గృహం! మనప్రభువైన యేసు యొక్క మహోచితమైన కృపవలన, ఆయన చిత్తానికి లోబడుట ద్వారా మనం దరం ఆ నిత్య గృహంలో ప్రవేశించుదము గాక !!

**- పెరికోతమ్**

(సమాప్తం)

# విగ్రహారాధన

(Idolatry)

"ఆదియందు దేవుడు" అను మాటలతో పరిశుద్ధాత్మావేశ లేఖకుడైన మోషే తన వ్రాతల నారంభిస్తూ దేవుని సర్వోన్నతునిగా కనుబరచాడు. తరువాత ఏదెను వనంలో మానవుని జీవితాన్ని వర్ణిస్తూ దానికి కేంద్రంగా దేవుడే యున్నాడని తెలియబరచాడు; ఏలయనగా దేవుని సన్నిధి అక్కడ యుండెను (ఆది 3:3).

కాలము గడుచుసరికి లోకంలో పాపం ప్రవేశించింది. మానవుడు దేవుని నుండి వేరైపోయాడు. మానవుడు దుష్టత్వంలో ముదిరే కొలదీ దేవుని నుండి దూరమై పోయాడు. మానవుని దుష్టత్వం ఎంత ఘోరంగా తయారయ్యిందంటే భూమిమీద లేకుండ మానవుని నాశనం చేయాలని దేవుడనుకొన్నాడు. ఆనాటి లోకమంతా దేవుని నుండి దూరమై పోయినను తన జీవితంలో దేవునికి ముఖ్యస్థానాన్నిచ్చిన వాడొకడున్నాడు. "నోవహు యెహోవా దృష్టియందు కృప పొందిన వాడాయెను (ఆది 6:8).

దేవుని ప్రజలు దేవుని నుండి వేరై తమచుట్టు యున్న అన్యజనుల దేవుండ్ల దగ్గరకు తరలిపోయిన ఉదంతములతో పాత నిబంధన నిండియున్నది.

### దేవుని నుండి వేరైన ప్రజలు

నిర్గమ కాండములో చూస్తే ఇశ్రాయేలీయులు విగ్రహారాధన చేయు ప్రజలకు బానిసలుగా యున్నారు. అయితే దేవుడు జోక్యం చేసుకొని మోషే ద్వారా తన ప్రజలను బానిసత్వము నుండి విడిపించాడు (నిర్గమ 3:18). మానవుని మనోభావాలకు కేంద్రంగా దేవుడే యుండాలని కోరుచున్నట్లు ఆయన చూపించాడు. అయినను ఇశ్రాయేలీయులు బానిసత్వము నుండి విడుదల

పొందగానే, ఐగుప్తీయుల దేవుండ్లను కాంక్షించుచున్న వారిగా కనబడు చున్నారు. నిర్గమ 32:1,4 వచనాల్లో ఇట్లు వ్రాయబడి యున్నది : "మోషే కొండ దిగకుండ తడవు చేయుట ప్రజలు చూచి నప్పుడు ఆ ప్రజలు అహరోను నొద్దకు కూడివచ్చి - లెమ్ము, మా ముందర నడచుటకు ఒక దేవతను మా కొరకు చేయుము అని చెప్పిరి. అతడు వారి యొద్ద వాటిని తీసికొని పోగరుతో రూప మును ఏర్పరచి దానిని పోతపోసిన దూడగా చేసెను. అప్పుడు వారు ఓ ఇశ్రాయేలూ, ఐగుప్తుదేశములో నుండి నిన్ను రప్పించిన నీ దేవుడు ఇదే అనిరి''. వారెంత తొందరగా మర్చిపోయారో! కొండమీద మోషేకు ఇయ్యబడిన మొదటి ఆజ్ఞను, "నేను తప్ప వేరే దేవుడు నీకు ఉండకూడదు" అను ఆజ్ఞను వారు మర్చిపోకుంటే ఎంత బావుండునో! (నిర్గమ 20:3).

ఇదంతా ఈనాడు మనకెలా వర్తిస్తుంది యని మీరడుగ వచ్చు. గలతీ 5:19-21లో పౌలు ఇట్లు హెచ్చరిక చేసాడు: "శరీరకార్యములు స్పష్టమై యున్నవి; అవేవనగా, జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన మొదలైనవి. వీటిని గూర్చి నేను మునుపు చెప్పిన ప్రకారము ఇట్టివాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించు కొనరని మీతో స్పష్టముగా చెప్పు చున్నాను". నేను విగ్రహాలకు మ్రొక్కను, గనుక ఇది నాకెలా వర్తిస్తుంది యని మరల మీ రడుగవచ్చు. కొలస్స 3:5లో పౌలు ఇట్లు వ్రాసాడు : "కావున భూమి మీద నున్న మీ అవయవములను అనగా జారత్వమును, అపవిత్రతను, కామాతురతను, దురాశను, విగ్రహారాధ నయైన ధనాపేక్షను చంపివేయుడి".

## ఆస్తిపరుని విగ్రహం

యేసుప్రభువు ఈ లోకంలో యున్నప్పుడు ఒక యౌవనస్థుడు వచ్చి, "నిత్య జీవము పొందుటకు నేను ఏ మంచి కార్యము చేయవలెనని ఆయనను అడిగెను" (మత్తయి 19:16). నీవు ఆజ్ఞలను గైకొనవలెనని క్రీస్తు అతనితో చెప్పగా ఆజ్ఞలు గైకొనుచున్నానని అతడు జవాబిచ్చాడు. "అందుకు యేసు - నీవు పరిపూర్ణుడగుటకు కోరిన యెడల, పోయి నీ ఆస్థిని అమ్మి బీదలకిమ్ము, అప్పుడు పరలోకమందు నీకు ధనము కలుగును, నీవు వచ్చి నన్ను వెంబడింపుమని అతనితో చెప్పెను. అయితే ఆ యౌవనుడు మిగుల ఆస్తిగలవాడు గనుక ఆ మాట విని వ్యసనపడుచు వెళ్ళిపోయెను" (మత్తయి 19:21-22).

## దేవుని మెప్పుకోరాలి

దేవునికంటే ఘనమైనదిగా దేనిని ఎంచరాదని క్రీస్తు విపులంగా బోధించారు.

"తండ్రినైనను తల్లినైనను నాకంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు; కుమారునినైనను కుమార్తెనైనను నాకంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు" అని ఆయన హెచ్చరిక చేసాడు (మత్తయి 10:37). దేవుని మెప్పుకంటే మనుష్యుల మెప్పును కోరిన వారినిగూర్చి యోహాను 12:42, 43లో మనం చదువగలం: "అయినను అధికారులలో కూడ అనేకులు ఆయన యందు విశ్వాసముంచిరి గాని, సమాజములో నుండి వెలివేయబడుదు మేమోయని పరిసయ్యులకు భయపడి వారు ఒప్పుకొన లేదు. వారు దేవుని మెప్పుకంటె మనుష్యుల మెప్పును ఎక్కువగా ఆపేక్షించిరి".

దీని నంతటినుండి మనం గ్రహించవలసింది యేమంటే, దేనికైనా దేవుని కంటే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిన యెడల మనం విగ్రహారాధన చేసినట్లగును. ఏలయనగా ఆది మనకొక విగ్రహము గును. అట్టి వాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరు. అయితే, "మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి" యని మన ప్రభువు చెప్పిన హెచ్చరికను జ్ఞాపకముంచు కొందము (మత్తయి6:33). . మనమట్లు చేసిన యెడల విగ్రహారాధన పాపము వలన అపరాధులము కాకుందము.

- పాల్ కేంట్రల్

'సత్యవాణి' కార్యక్రమంలో రేడియోలోను, టి.వి.లోను మీరు వినుచున్న పాటలు ఇప్పుడు నాలుగు కేసెట్లలో లభించుచున్నవి. మొత్తము 55 పాత క్రొత్తపాటలు వీనుల విందుగా పాడి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రికార్డు చేయబడినవి. దేవుని పాటలు పాడి మహిమ పరుచుటలో యివి సహాయ పడును. 4 కేసెట్ల విలువ పోస్టేజీతో సహా 130/-లు మాత్రమే. ఈ కేసెట్లు కావలసిన వారు వెంటనే దిగువ చిరునామాకు డబ్బు పంపి పొందవచ్చును.

SATYA VANI, 7-9-35, Sambhamurthy St. Kakinada - 533 004.

## సంక్షిప్త వార్తలు

2005 అక్టోబరు 5, 6 తేదీలలో జాషువా గూటం గారు సతీసమేతముగా న్యూఢిల్లీలోని క్రీస్తు సంఘమును దర్శించిరి. అక్కడ స్థానిక సంఘము యొక్క ఆరాధన స్థలము మార్పు చేయబడినది. అందు మూలముగా దానిని వారు పర్యవేక్షించుట జరిగినది. ఇప్పుడు న్యూఢిల్లీలోని స్థానిక సంఘము యొక్క అడ్రసు యిది: Church of Christ, B-350, Chittaranjan Park, New Delhi - 110 019. ప్రతి ఆదివారం ఉదయం 10 గంటలకు అక్కడ ఆరాధన జరుగును.

జె.సి.ఛోట్ గారికి ఊపిరితిత్తుల కేన్సర్ సోకినందున ఆపరేషన్ చేయబడింది. ఆయన ఇప్పుడు నెమ్మదిగా కోలుకొనుచున్నారు. మీ అందరి ప్రార్థనలు అభ్యర్థించు చున్నారు. వారి సతీమణి బెట్టీ ఛోట్ కొరకును ప్రార్థించమనవి.

తూర్పుగోదావరి జిల్లా గొల్లపాలెం క్రీస్తుసంఘం నిర్వహించిన యౌవనుల సహవాస కూడికలు అక్టోబర్ 7,8 తేదీలలో విజయవంతముగా జరిగినవి. సహో. మణికుమార్ గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కూటములలో ముఖ్య ప్రసంగీకులుగా పి.జాన్‌మోజెస్ (గొల్లపాలెం), పి.విజయకుమార్ (కాకినాడ) జాన్ రిక్కీ గూటం (కాకినాడ), యం.చినరాజు (రామంచంద్రపురం) గార్లు పాల్గొనిరి. రిక్కీ గూటం గారు వారి బృందముతో విచ్చేసి ఆంగ్లములో, తెలుగులో పాటలు పాడి స్థానిక యౌవనులను ఉత్తేజపరచినారు. ప్రత్యేక గీతాలాపన చేయుటకు విజయనగరం నుండి సాంసన్‌గారు, నిడమానూరు నుండి అలెగ్జాండర్, నాగేశ్వరావు గార్లు వచ్చి అనేక నూతన గీతములు నేర్పించిరి. రిక్కీ గూటం గారు ఈ యౌవనుల సహవాస కూటములో ఉదయం, సాయంత్రం కూడ మంచి వాక్యపరిచర్య చేసిరి. కాకినాడ నుండి యౌవనుల బృందముతో సహో వారు హాజరై స్థానిక యువకులను ప్రోత్సహించిరి.

అక్టోబరు 11, 12, 13 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవులో యున్న క్రీస్తు సంఘము సువార్త సహవాస కూటములు జరిపించిరి. ఆ కూటములలో సోదరులు, స్థానిక సువార్తికులు పి. జాన్‌విక్టర్, స్టీవెన్‌కుమార్ (రామచంద్రపురం), మరియు జాషువా గూటం గార్లు వాక్యపరిచర్య చేసిరి. స్థానిక సంఘస్థులు, పరిసర గ్రామస్థులు హాజరై కూటములను జయప్రదము గావించిరి. గొప్ప ఆత్మీయ సహవాసము ననుభవించిరి. 5గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. దూరప్రాంతముల నుండి వచ్చినవారికి స్థానిక

సంఘము భోజన పానీయాల నేర్పాటు చేసిరి. తాళ్లరేవులోను, పరిసర గ్రామములలోను సోదరులు జాన్ విక్టర్ గారు క్రీస్తు కొరకు మంచి సువార్త పనిచేయు చున్నారు.

అక్టోబరు 14వ తేదీ శుక్రవారం పిఠాపురం మండలం కొత్త కందరాడలో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు రిక్కీగూటం గారు రిబ్బరు కత్తిరించి, ప్రార్థించి క్రీస్తు పనికొరకు ప్రతిష్టించిరి. స్థానిక సంఘస్థులు, పలువురు సోదరులు ఆ కూటమునకు హాజరైరి. ఆ సందర్భముగా సోదరులు చొప్పల మారనాతరావు, ఎమ్.మత్తయి, ఎమ్.సూర్యరావ్ గార్లు ప్రార్ధనలు చేసిరి. రిక్కీగారు చక్కటి వాక్యపరిచర్య చేసిరి. వచ్చిన వారందరికీ మంచి విందు జరిగెను. కొత్త కందరాడలో సోదరులు ఎమ్. యేసుదాసుగారు సువార్త చాటు చున్నారు.

అక్టోబరు 16వ తేదీ ఆదివారం మధ్యాహ్నం రాజమండ్రి సారంగధర మెట్టలోని క్రీస్తు సంఘము యౌవనులకు ప్రత్యేక కూడిక నిర్వహించిరి. ఆ కూటమును సోదరులు వి.సుదర్శనరావ్ గారి కుమారులు రాజ, బాబీలు ఘనంగా నిర్వహించిరి. ఆ కూటమునకు కాకినాడ సత్యవాణి క్రీస్తు సంఘము నుండి ఇంచుమించు 12 మంది యువకులతో సోదరులు రిక్కీ గూటం గారు హాజరై వాక్యపరిచర్య చేసిరి. యువకులు దేవుని పనిలో చురుకుగా పాల్గొనుట క్రీస్తు సంఘమునకు క్షేమము.

RNI Road No. 69973/98
Postal Regd. No. VM/KD/02

To

From:

**SATYA VAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Jashuva Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004